క్లుప్తంగా

కూరగాయలతో సంపూర్ణ ఆరోగ్యం



తరగతి గదిలో కూరగాయలతో పిల్లలు

అర్వపల్లి : కూరగాయలతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మాంటిస్సోరి పాఠశాల కరస్పాండెంట్ విపిన్‌కుమార్ అన్నారు. శనివారం అర్వపల్లిలోని మాంటిస్సోరి పాఠశాలలో పిల్ల లకు విజిటెబుల్ సలాడ్ పోటీలను నిర్వహించారు. పిల్లలు వివిధ రకాల కూరగాయలతో సలాడ్ చేసి ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మను, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, దీప, రజిత, యమున, దేవేంద్ర, నిర్మల, సోని పాల్గొన్నారు.

పిల్లల చదువును నిర్లక్ష్యం చేయొద్దు



లక్ష్మాపురం పాఠశాలలో మాట్లాడుతున్న సర్పంచ్ సుధాకర్

నాగారం: తల్లిదండ్రులు తమ పిల్లల చదువు పట్ల నిర్లక్ష్యం చేయకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్పంచ్ కుంటపల్లి సుధాకర్ అన్నారు. శనివారం మండలంలోని లక్ష్మాపురం ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల మీటింగ్ (పీటీఎం)లో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులను క్రమంతప్పకుండా పాఠశాలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జలగం యాకస్వామి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

భానుపురి(సూర్యాపేట) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో సోమవారం వరంగల్‌కు చెందిన శరత్ మాక్సివిజన్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసుందర్‌రెడ్డి, నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే వైద్య పరీక్షలకు పెన్షనర్లు హెల్త్ కార్డును వెంట తెచ్చుకోవాలని కోరారు. అలాగే తమ లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించని పెన్షనర్లు ఈ నెల చివరి వరకు సమర్పించాలని, లేదంటే పెన్షన్ నిలిచిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు.

యూనిఫైడ్ కౌన్సిల్ పరీక్షలో జయ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : యూనిఫైడ్ కౌన్సిల్ జాతీయ స్థాయిలో నిర్వహించిన నేషనల్ లెవల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో జయ ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్ నుంచి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు ఒకరు, 3వ ర్యాంకు ముగ్గురు, 4వ ర్యాంకు ఒకరికి, 29వ ర్యాంకు ఒకరికి, 11 మంది విద్యార్థులు 500 లోపు ర్యాంకులు సాధించారని జయ పాఠశాలకరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు జిల్లా పద్మ, బింగి జ్యోతి అభినందించారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నూతనకల్ : గరిడేపల్లి మండలం కేంద్రంలో ఈ నెల 23న నిర్వహించే ఐఎఫ్‌టీయూ జిల్లా 5వ మహాసభలను విజయవంతం చేయాలని హమాలీ మిల్లు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మధు కోరారు. శనివారం మండల పరిధిలోని యడవెల్లిలో జిల్లా మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వాలు సమగ్ర కార్మిక చట్టాలను తయారు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు మరికంటి సైదులు, వెంకన్న, సంజీవ, శ్రీను, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న కుక్కకాటు బాధితులు

- జాజిరెడ్డిగూడెం మండలంలో ఎక్కువైన శునకాల బెడద
- రెండు నెలలుగా వంద మందికిపైగా గాయాలు
- ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే జంకుతున్న జనం
- కుక్కలను నియంత్రించాలని ప్రజల వేడుకోలు



అర్వపల్లిలో కుక్కల స్వైర విహారం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలంలో రోజురోజుకూ కుక్కల బెడద ఎక్కువవుతోంది. వీధుల్లో ఎటు చూసినా కుక్కలు గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ జనాన్ని హడలెత్తిస్తున్నాయి. నిత్యం ఏదో ఒకచోట ప్రజలు కుక్కల దాడుల బారిన పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, అలాగే మూగజీవాలను కూడా వెంటపడి కరిచి గాయపరుస్తున్నాయి. రెండు నెలల వ్యవధిలో దాదాపు 100 మందికిపైగా కుక్కకాటుకు గురై క్షతగాత్రులుగా మారి ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు.

భయాందోళనలో జనం

మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో వందలాది వీధి కుక్కలు ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ కుక్కల బెడదతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. రాత్రిపూటనైతే అత్యవసర పనిమీద బయటకు వెళ్లేవారు. చేతిలో కర్రలు పట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. ప్రధానంగా రోడ్లపై ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి వెంట పడుతున్నాయి. ఈ క్రమంలో ఆయా వాహనాల మీద వెళ్లేవారు ప్రమాదాల బారిన పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. ముఖ్యంగా అర్వపల్లిలో రెండు హైవేలపై వెళ్లే ద్విచక్ర వాహనదారులపై ఇటీవల కుక్కలు వెంటపడగా పలువురు గాయపడిన సంఘటనలు జరిగాయి. ఇప్పటికైనా గ్రామ పంచాయతీల పాలకవర్గాలు, అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

కుక్కలను నిర్మూలించాలి



గతంలో ఏటా గ్రామ పంచాయతీలు కుక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టేవి. కొన్నాళ్లుగా కుక్కలను నియంత్రించకపోవడంతో వీటి సంఖ్య రెట్టింపు స్థాయిలో పెరిగింది. దీంతో నిత్యం ఎక్కడో ఒకచోట కుక్కలు జనంతోపాటు మూగ జీవాలపై దాడి చేస్తూ గాయపరుస్తున్నాయి.

– పాక వీరేష్ యాదవ్, సామాజిక కార్యకర్త

వ్యాక్సిన్ అందుబాటులో ఉంది



కుక్కకాటుకు గురైనవారు నిర్లక్ష్యం చేయొద్దు. కుక్క కరిచిన వెంటనే స్థానిక ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలి. కుక్క కరిచిన సమయంలో గాయం లేదని నిర్లక్ష్యం చేస్తే పరిస్థితి విషమంగా మారే ప్రమాదముంది. అర్వపల్లిలోని పీహెచ్‌సీలో 100 డోసుల వరకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

– డాక్టర్ చిలుకూరి మణిదీప్, మండల వైద్యాధికారి

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్



తొండ గ్రామ సర్పంచ్ శాతవాహనరావుకు బీఆర్‌ఎస్ పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే

తిరుమలగిరి (తుంగతుర్తి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించిందని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. శనివారం తిరుమలగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తొండ గ్రామ సర్పంచ్ నెమురుగొమ్ముల శాతవాహనరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి మాట్లాడుతూ గతంలో తుంగతుర్తి నియోజకవర్గంలో కక్షలు, కారుణ్యాలు ఉండేవని, ప్రస్తుతం సంవత్సరం పొడవునా వస్తున్న గోదావరి జలాలతో సస్యశ్యామలంగా మారిందన్నారు. త్వరలోనే దేవాదుల ప్రాజెక్టు ద్వారా తిరుమలగిరి, తాటిపాముల, మాలిపురం, అనంతారం, నందపురం గ్రామాల్లో 13 వేల ఎకరాలకు నీళ్లు వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై అందరూ బీఆర్‌ఎస్ పార్టీలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ గుజ్జ దీపికా యుగేంధర్‌రావు, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, దూపటి రవీందర్, రజనీకాంత్‌రెడ్డి, , మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు, రామారావు, వెంకన్న, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటితో చివరి గడువు

సూర్యాపేట : సూర్యాపేట మండల పరిధిలోని ఇమాంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశాలకు ఈ నెల 20 వరకు చివరి గడువు పొడిగించినట్టు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ బి.ఝాన్సీరాణి శనివారం ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 23న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి



ఆయుష్మాన్ భారత్ పథకం నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న నాయకులు

దురాజ్‌పల్లి(సూర్యాపేట) : తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ఆయుష్మాన్ భారత్ పథకం కింద పేర్లు నమోదు చేసుకోవాలని బీజేపీ సూర్యాపేట అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్ అన్నారు. శనివారం సూర్యాపేటలోని 36వ వార్డులో ఆ పార్టీ నాయకులు యార్లగడ్డ రామారావు, బహురోజు నాగేశ్వరచారి ఆధ్వర్యంలో నిర్వహించిన పీఎం ఆయుష్మాన్ భారత్ కార్యక్రమ నమోదు ప్రక్రియను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలు అనారోగ్యం కారణంగా హాస్పిటల్‌కి వెళ్లినప్పుడు ఆర్థిక ఇబ్బందులు పడకుండా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో ఆయుష్మాన్ భారత్‌తోపాటు ఇతర కేంద్ర పథకాలకు అర్హులైన నిరుపేదలు దరఖాస్తులు చేసుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సలింటి వేరేంద్ర, మన్మదరెడ్డి, పల్స మల్సూర్‌గౌడ్, అబీద్ పాల్గొన్నారు.

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

మద్దిరాల : పేపర్ లీకేజీల ద్వారా నిరుద్యోగులకు అన్యాయం జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఎనిమిదేళ్ల నుంచి వేలాది మంది ఎదురుచూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బర్పటి ఉపేందర్, బొబ్బిలి వెంకన్న, పచ్చి పాల వెంకన్న, మద్దెల భిక్షపతి, పాక అమృతమల్లు, తాళ్లపల్లి సురేష్, కసనబోయిన లింగయ్య, కోడి కుమార్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



చీదెళ్లలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెన్‌పహాడ్ : ఈ నెల 23న గరిడేపల్లిలో జరిగే ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని రూపొందించిన కరపత్రాలను శనివారం చీదెళ్ల గ్రామంలో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబీసీ గ్రామ అధ్యక్షుడు మస్తాన్ మాట్లాడుతూ కార్మికులకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించడం దారుణమన్నారు. కార్యక్రమంలో కాముళ్ల కవిత, నాగరాజు, జంపాల వెంకన్న, రాంబాబు, బూబమ్మ, జానమ్మ, రాములమ్మ, శాంతమ్మ, వెంకటరమణ, సురేష్, సంతోష్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా సీసీ రోడ్డు నిర్మాణం

అర్వపల్లి : గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో శనివారం గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్వచ్ఛందంగా చేపట్టారు. గ్రామంలోని రేణుకాఎల్లమ్మ దేవాలయం చుట్టూ, సమీపంలో తలపెట్టిన సీసీ రోడ్డు పనులను బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ ప్రారంభించారు. అలాగే అనారోగ్యానికి గురైన బీఆర్‌ఎస్ నాయకుడు సన్నాయిల బంగారిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం ఉషారాణినాగరాజు, వార్డు సభ్యులు చింతల దీపికసురేష్, చెనగాని యాగానందం, గోగుల మమత, బీఆర్‌ఎస్ నాయకులు కొప్పుల సోమిరెడ్డి, పెద్ది శ్రీను, కోటమర్తి మల్లయ్య, పున్న హరిప్రసాద్, బి.వెంకన్న, కుంభం నాగరాజు, యాదయ్య, సోమయ్య, నర్సింగ వెంకన్న పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

చివ్వెంల(సూర్యాపేట): మండల పరిధిలోని సేవాలాల్‌తండా ఆవాసం బులాకితండాకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన రూ. 5లక్షల నిధులతో ప్రధాన వీధుల్లో చేపట్టిన 182 మీటర్ల పొడవైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను శనివారం సర్పంచ్ గుగులోతు కవిత అనిల్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు



చివ్వెంల (సూర్యాపేట) : సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

పుస్తె, మెట్టెలు అందజేత



వధూవరులతో వైస్ ఎంపీపీ మణిమాల తదితరులు

నాగారం : మండల కేంద్రానికి చెందిన ఫ్లెక్సీ డిజైనర్ వద్దిగల్ల ఉపేందర్–మౌనిక వివాహానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల శుక్రవారం పుస్తె, మెట్టెలు, పట్టు వస్త్రాలను అందజేశారు. అనంతరం వారిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎంపీపీ కూరం మణివెంకన్న, నాయకులు చిప్పలపల్లి ఉపేందర్, బాలస్వామి, చిప్పపల్లి సైదులు, లక్ష్మయ్య, మహేంద్రబాబు, జానయ్య పాల్గొన్నారు.

సంఘబంధం అవకతవకలపై విచారణ



విచారణ జరుపుతున్న సెర్ప్ అధికారులు

నూతనకల్ : మండలంలోని చిల్పకుంట్ల గ్రామంలో సంఘబంధం లావాదేవీల్లో అవకతవకలపై శనివారం సెర్ప్ ఆడిటర్స్ బాలస్వామి, మల్లేష్ విచారణ చేపట్టారు. సంఘబంధం ఆధ్వర్యంలో 2020–21 సంవత్సరంలో కొనుగోలు కేంద్రం నిర్వహణతోపాటు స్త్రీనిధి సమృద్ధి రుణాలు, సంఘబంధం నిల్వల విషయంలో వీబీకే బత్తుల సరిత అవినీతికి పాల్పడిందని సంఘబంధం అధ్యక్షురాలు యమున కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపడుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా స్త్రీనిధి ద్వారా రుణాలు పొందిన వారితో పాటు కొనుగోలు కేంద్రం నిర్వహణ, సంఘబంధ లావాదేవీలపై గ్రామస్తుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విచారణ నివేదికను జిల్లా అధికారులకు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంపెల్లి రాంరెడ్డి, సీసీ సరస్వతి, సంఘబంధం సభ్యులు బాణాల సంధ్య, పోలెపాక సుశీల తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

తుంగతుర్తి : మండల పరిధిలోని బండరామారం గ్రామానికి చెందిన పులుసు వెంకన్నకు మంజూరైన రూ.60,000 సీఎం సహాయనిధి చెక్కును బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం ఉప్పలయ్య, వీరబోయిన రమేష్, పులుసు ఉప్పలయ్య, పొడేటి యాదగిరి, రామకృష్ణ, డీలర్ యాదగిరి, రమేష్, వెంకన్న పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ డానియేల్‌కుమార్

తుంగతుర్తి : విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఎస్‌ఐ డానియేల్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాలు, షీటీంలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం పోలీసు కళాబృందం సభ్యులు తమ ఆట, పాటల ద్వారా విద్యార్థులకు సైబర్ నేరాలు, షీటీం, మహిళా భద్రత రక్షణ, డైల్ 100, సోషల్ మీడియా, మానవ అక్రమ రవాణా, లింగ వివక్ష, పిల్లల భద్రత, సెల్‌ఫోన్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామలత, షీటీం ఏఎస్‌ఐ పాండు నాయక్, ఏఎస్‌ఐ రాంకోటి, షీటీం సిబ్బంది శివరాం, సిబ్బంది మురారి, సైదులు, సతీష్ నరేందర్, విజయ్, కళాబృందం సభ్యులు యల్లయ్య, గోపయ్య, చారి, గురులింగం, నాగార్జున, కృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

సూర్యాపేట రూరల్: గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం మండల పరిధిలోని కాసరబాద గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో జనారోగ్య సమితి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో స్వచ్ఛత, పరిశుభ్రత, జీవనశైలి, వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్ కొల్లు రేణుక, ఎంపీటీసీ బంటు నాగమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, వైద్యాధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి

కళా ప్రపూర్ణ అవార్డుకు నరేష్‌చారి ఎంపిక

కోదాడఅర్బన్ : విశ్వకర్మ పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా కవులు, కళాకారులకు అందజేస్తున్న అవార్డులలో భాగంగా కోదాడకు చెందిన సూక్ష్మ కళాకారుడు వెగ్గలం నరేష్‌చారి కళా ప్రపూర్ణ అవార్డుకు ఎంపికైనట్లు ట్రస్ట్ చైర్మన్ ఎస్‌ఎస్ మల్లేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న గుంటూరు జిల్లా చుట్టుగుంటలో పోలేరమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఈ అవార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. దేశ సంస్కృతి, సంప్రదాయాలను దేశం నలుమూలల విస్తరింపజేస్తున్న వ్యక్తులను ఎంపిక చేసి ఈ అవార్డులు అందజేసి సత్కరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

తుంగతుర్తి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల పరిధి లోని కర్విరాల కొత్తగూడెం గ్రామంలో అంకితం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యశోద ఆస్పత్రి యాజమాన్యం సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాంరెడ్డి, లింగారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



తిరుమలగిరి : స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరిలోని కృష్ణవేణి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యాశాఖ మంత్రి, కలెక్టర్, డీఈఓ, మున్సిపల్ చైర్మన్ వేషధారణల్లో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నగేష్, ఉపాధ్యాయులు సలీంపాషా, యాదగిరి, సతీష్, గిరిధర్, అరుణ, పర్వీనా, ఉష, ఉపేందర్, పీటర్, వినోద, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

గౌడజన హక్కుల పోరాట సమితి కమిటీ ఎన్నిక



ఆత్మకూర్ (ఎస్) మండల అధ్యక్షుడిగా నియామకపత్రం అందుకుంటున్న సతీష్ గౌడ్



కిరణ్‌కుమార్ గౌడ్

అర్వపల్లి : గౌడజన హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షునిగా కోడూరుకు చెందిన తండు కిరణ్‌కుమార్‌గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు ఆయనకు నియామకపత్రాన్ని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు నారాయణగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌గౌడ్ శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండగాని సోమేష్‌గౌడ్, బిక్కి కృష్ణగౌడ్, రమేష్, శంకర్, దశరథ పాల్గొన్నారు.

ఆత్మకూర్ (ఎస్) మండల ప్రెసిడెంట్‌గా సతీష్ గౌడ్

ఆత్మకూర్ (ఎస్) : గౌడజన హక్కుల పోరాట సమితి ఆత్మకూర్ (ఎస్) మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చౌగోని సతీష్‌గౌడ్ నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఎలికట్ట విజయకుమార్ గౌడ్ ఆదేశానుసారం జిల్లా అధ్యక్షులు చిత్తలూరు నారాయణ గౌడ్ సతీష్‌కు నెమ్మికల్లులో నియామకపత్రం అందించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చౌగాని శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బిక్కి బుచ్చయ్య గౌడ్, మండల అధ్యక్షుడు జలగం మల్లేష్, నాయకులు సోమన్న, జెర్రిపోతుల సైదులు, పల్సా వెంకటేష్, గునగంటి సతీష్, కట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ.. యువకుడు మృతి

నాగారం: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొని యువకుడు మృచెందిన సంఘటన నాగారంబంగ్లా శివారులో సూర్యాపేట–జనగాం జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పాల్వాయి విజయ్(18) తిరుమలగిరి మండలం మామిడాలకు వెళ్లి మరో యువకుడితో కలిసి కారులో స్వగ్రామానికి వెళుతున్నాడు. ఈ క్రమంలో సూర్యాపేట నుంచి వరంగల్‌కు నలుగురు వ్యక్తులతో వెళుతున్న మరో కారు నాగారంబంగ్లా శివారులోని పెట్రోల్ బంక్ సమీపంలో మూలమలుపు వద్ద అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాల్వాయి విజయ్ అక్కడికక్కడే మృతి చెందగా మరో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయనున్నట్లు సీఐ రాజేష్ తెలిపారు.

మత్స్య సొసైటీ ఎన్నికలో అవకతవకలు



సమావేశంలో మాట్లాడుతున్న వీరబాబు

మునగాల : మండలంలోని కలకోవలో ఈనెల 14న జరిగిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలో అవకతవకలు జరిగినట్లు ఆ గ్రామానికి చెందిన బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి వీరబాబు, మాజీ సర్పంచ్ చిర్ర శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం కలకోవలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికలను బహిష్కరించిందని సీపీఎం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీపీఎం నాయకులు తాము 9 మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఏకగ్రీవంగా ఎన్నుకున్న డైరెక్టర్లలో సురభి సైదమ్మ అనే మహిళ గ్రామంలో అంగన్‌వాడీ ఆయాగా విధులు నిర్వర్తిస్తుందని, మరి సంఘం డైరెక్టర్‌గా ఏ విధంగా కొనసాగుతారని, ఈ విషయమై తాము ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే మరో మహిళా డైరెక్టర్‌గా సాల పద్మ మునగాల గ్రామానికి చెందిన వ్యక్తి అని వివరించారు. ఇతర గ్రామానికి చెందని మహిళను ఏ విధంగా ఎన్నుకుంటారని ప్రశ్నించారు. సొసైటీ బైలా ప్రకారం ఈ రెండు డైరెక్టర్ పదవుల ఎన్నికకు సంబంధించి ఆధారాలతో తాము అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. గత 25 ఏళ్లుగా సంఘాన్ని సీపీఎం పార్టీ నాయకులు తమ గుప్పెట్లో ఉంచుకొని బోగస్ సభ్యులతో అవినీతికి పాల్పడుతూ కోట్ల రూపాయలు వెనకవేసుకొని అనవరంగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యపై వ్యక్తిగత దూషణలు, ఆరోపణలు చేయడం సమంజసం కాదని హితవు పలికారు. జిల్లా అధికారులు విచారణ చేపట్టి అనర్హులైన సభ్యులను తొలగించి కొత్త సభ్యత్వాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో వీరయ్య, శ్రీను, రామకృష్ణ, వెంకటేశం పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన



కొత్తగూడెంలో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలో శనివారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ పథకాలపై తమ ఆటాపాట, మాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారథి జిల్లా టీంలీడర్ మేడిపల్లి వేణు, కళాకారులు వెన్నెల నాగరాజు, ఉదయ్, శ్రీకాంత్, రాములు, ఉపేందర్, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.